

ఆకట్టుకున్న రంగవల్లులు

కొడంగల్‌లో వెలసిన పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 8లో▸



నిషేధిత మాంజా స్వాధీనం

పట్టణంలో అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత చైనా మాంజాను తాండూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 8లో▸



పంటలపై కాలుష్యం కాటు

సుద్ద కాలుష్యం(డస్టు) వలన పంటలు దెబ్బతిని, నష్టపోతున్నామని రైతులు ఆవేదన చెందుతున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఎస్సీ వర్గీకరణకు ఉద్యమిస్తాం

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ



సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జున మాదిగ తదితరులు

తాండూరు రూరల్: ఎస్సీ వర్గీకరణకు కోసం పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ అన్నారు. శనివారం పట్టణంలో సంఘం మండలం ఇన్‌చార్జ్ నర్సింలు మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగలు సంఘటితం కావాలన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు సహకరించాలని కోరారు. జనవరి 15న ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింలు మాదిగ, మాణిక్యప్ప మాదిగ, మొగులప్ప మాదిగ, అబ్రహాం మాదిగ, భీమప్ప మాదిగ, పరుశురాం మాదిగ, రాజేశ్వర్ మాదిగ,శేఖర్‌మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా భజన పోటీలు



పోటీలో పాల్గొన్న కళాకారులు

కుల్కచర్ల: జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతిని పురస్కరించుకుని మండలంలోని బండవెల్కిచర్ల పాంబండ రామలింగేశ్వర ఆలయంలో శనివారం భజన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా వెంకట రంగారెడ్డి ఫౌండేషన్ కోఆర్డినేటర్ రాంచంద్రయ్య మాట్లాడారు. జస్టిస్ కొండా మాధవరెడ్డి శత జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా భజన పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన భజన మండలికి బహుమతి ప్రదానం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుల్కచర్ల సర్పంచ్ సౌమ్యారెడ్డి, బండవెల్కిచర్ల ఎంపీటీసీ జ్యోతి, న్యాయ నిర్ణేతలు రాజు, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

స్వగ్రామంలో చెన్నారెడ్డి జయంతి



చెన్నారెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సిరిపురం వాసులు

మర్పల్లి: మండలంలోని సిరిపురంలో స్వర్గీయ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి 105వ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులు, స్థానికులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు సీఎంగా ఉండి తెలంగాణ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శంకరయ్య గౌడ్, రాజేందర్ రెడ్డి కొనియాడారు. కేంద్ర మంత్రిగా, పలు రాష్ట్రాల గవర్నర్‌గా విధులు నిర్వహించి దేశానికి సేవ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లయ్య, నాయకులు రాజిరెడ్డి, శంకరయ్యగౌడ్, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

సుద్ద గనుల్లో తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్..

పెద్దేముల్: సుద్ద గనుల్లో అక్రమ తవ్వకాలపై శనివారం సాక్షి దినపత్రికలో 'పెర'గని' ఆదాయం' శీర్షికన ప్రచురితమైన కథనానికి మైన్స్ శాఖ అధికారులు స్పందించారు. మండలంలోని మారేపల్లి, గోపాల్‌పూర్, రుద్రారం, తింసాన్‌పల్లి గ్రామాల్లోని సుద్ద గనులను పరిశీలించారు. అక్రమ తవ్వకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా సుద్ద తవ్వకాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాయల్టీ లేకుండా పరిశ్రమలకు సుద్దను తరలించిన వాహనాలను కూడా సీజ్ చేస్తామని తెలిపారు. పట్టా భూముల్లో సుద్ద తవ్వకాలకు ప్రభుత్వం లీజు మంజూరు చేస్తుందని, అవసరం ఉన్న వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంక్రాంతి పండుగ సెలవుల్లో సుద్ద తవ్వకాలు చేయరాదని ఆదేశించారు. వారి వెంట మైన్స్ శాఖ సిబ్బంది శ్రీను, పెద్ద శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



బిల్లదాఖలా ప్రాంతంలో మెడికల్ కళాశాల భవన నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలం

బిల్లదాఖలాకే మొగ్గు!

- ఇక్కడే మెడికల్ కళాశాల భవన నిర్మాణం చేపట్టాలని నిర్ణయం
- తొలుత అనంతగిరి గుట్టపై అనుకున్నా.. అక్కడ ఔషధ మొక్కలు తొలగించాల్సి వస్తుందని స్థల మార్పు
- రూ.235 కోట్లతో భవన సముదాయం

వికారాబాద్: పట్టణంలో మెడికల్ కళాశాలకు సొంత భవనం ఎక్కడ నిర్మించాలనే దానిపై అధికారులకు క్లారిటీ వచ్చింది. వికారాబాద్‌కు సమీపంలో గల బిల్లదాఖలా ప్రాంతంలో భవన సముదాయం నిర్మించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. జిల్లాకు మంజూరైన ప్రభుత్వ మెడికల్ కళాశాలను ప్రస్తుతం వికారాబాద్ సమీపంలోని అనంతగిరి గుట్టపై తాత్కాలిక భవనంలో నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం ఏడాది క్రితం జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. ప్రస్తుతం అనంతగిరి గుట్టపై 100 మంది విద్యార్థులతో తరగతులను నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సొంత భవనం ఎక్కడ నిర్మించాలనే విషయంలో అధికారులు తర్జనభర్జన పడుతూ వచ్చారు. రెవెన్యూ అధికారులు రెండు చోట్ల స్థల పరిశీలన చేసి ప్రభుత్వంతోపాటు మెడికల్ బోర్డుకు నివేదికలు పంపారు. ఇందులో ఒకటి బిల్లదాఖలా ప్రాంతం, రెండోది అనంతగిరి గుట్టపై గల టీబీ శానిటోరియం స్థలం. ప్రస్తుతం అనంతగిరికి వెళ్లే దారిలో రాజీవ్‌నగర్ కాలనీకి ఎదురుగా మెడికల్ ఆస్పత్రి నిర్వహణకు తాత్కాలిక భవనం నిర్మిస్తున్నారు. త్వరలో ఈ భవనం అందుబాటులోకి రానుంది.

ఈ స్థలం అనుకూలం

మెడికల్ కళాశాల భవన నిర్మాణానికి 30ఎకరాల భూమి అవసరమని మెడికల్ బోర్డు అధికారులు రెవెన్యూ శాఖకు రాసిన లేఖలో పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు వికారాబాద్‌కు సమీపంలోని బిల్లదాఖలా ప్రాంతంలో 30 ఎకరాలు, అనంతగిరి గుట్టపై 24 ఎకరాల భూమి అందుబాటులో ఉన్నట్లు తేల్చారు.అయితే బిల్లదాఖలా ప్రాంతంలో కళాశాల ఏర్పాటుకు మెడికల్ బోర్డు మొగ్గు చూపుతూ వచ్చింది.అనంతగిరి గుట్టపై శాశ్వత భవనం నిర్మిస్తే అక్కడి ఔషధ మొక్కలను తొలగించాల్సి ఉంటుంది. దీని వల్ల పర్యావరణానికి ముప్పు కలుగుతుంది. ఈ కారణంగానే అధికారులు పునరాలోచన చేశారు.దీంతో బిల్లదాఖలా ప్రాంతంలో కళాశాల భవనం నిర్మిస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. రూ.235 కోట్ల వ్యయంతో మెడికల్ కళాశాల శాశ్వత భవన సముదాయం నిర్మించనున్నారు. బిల్లదాఖలాలో 200 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండగా 30ఎకరాల భూమిని మెడికల్ కళాశాలకు కేటాయించనున్నారు.

పర్యావరణం దెబ్బతినకూడదనే..

జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కావడంతో వికారాబాద్‌లో 100 సీట్లతో వైద్య కళాశాల,280 పడకలతో జనరల్ ఆస్పత్రిని ప్రారంభించాల్సి ఉంది. ముందుగా అనంతగిరి గుట్టపై కళాశాల భవనం నిర్మించాలని నిర్ణయించారు. భూమిపూజ కూడా చేశారు. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు సిద్ధమవుతుండగా అనంతగిరి అటవీ ప్రాంతంలో 12వేల చెట్లను తొలగించాల్సి వస్తుందని అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపారు. అయితే వికారాబాద్ పేరు చెప్పగానే గుర్తొచ్చేది అనంతగిరి అటవీ ప్రాంతం.ఇక్కడ అనేక ఔషధ మొక్కలు, వన్యప్రాణులు, వివిధ రకాల పక్షి జాతులు ఉన్నాయి. ఇక్కడ కళాశాల భవన నిర్మాణం కోసం చెట్లను తొలగిస్తే అనంతగిరి ప్రత్యేకతకు ముప్పు వాటిల్లడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుందనే ఆలోచనకు అధికారులు వచ్చినట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే కలెక్టర్ నారాయణరెడ్డి కళాశాల భవనం బిల్లదాఖలా ప్రాంతం నిర్మిస్తే మంచిదని భావించినట్లు తెలుస్తోంది. వికారాబాద్ పట్టణం నుంచి అనంతగిరి వెళ్లే దారిలో ఉన్న బిల్లదాఖలా ప్రాంతంలో ప్రభుత్వ స్థలం ఉంది. ఇక్కడ మెడికల్ కళాశాల ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులు భావించారు. అంతేకాకుండా ఈ ప్రాంతం జిల్లా కేంద్రం వికారాబాద్‌కు రెండు కిలోమీటర్ల దూరంలో ఉండటం కలిసొచ్చే అంశంగా భావించి దీన్ని ఖరారు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

అనంతగిరి ఘాట్ రోడ్డు దిగుతుండగా ప్రమాదం

- బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పిన వాహనం
- నలుగురికి తీవ్ర, పలువురికి స్వల్ప గాయాలు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఆర్టీసీ, పోలీసు అధికారులు



తీవ్రంగా గాయపడిన మహిళను వాహనంలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

ధారూరు: అనంతగిరి గుట్ట నుంచి కిందకు ప్రయాణిస్తున్న ఆర్టీసీ బస్సు బ్రేకులు ఫెయిల్ కావడంతో పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా ఐదు మందికి స్వల్ప గాయాలయ్యాయి. ధారూరు సీఐ రామకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్, ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు.. శనివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి తాండూరుకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. ఈ క్రమంలో అనంతగిరి గుట్ట దిగుతుండగా నంది ఘాట్ వద్ద బస్సు బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. డ్రైవర్ రఫీ చాకచక్యంగా బస్సును చివరి గుట్ట జైదుపల్లి క్రాస్ రోడ్డు వరకు తీసుకెళ్లాడు. అక్కడ రోడ్డు కుడివైపు గల గుంతలోకి బస్సు దూసుకెళ్లి పైకి లేచి కింద పడింది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 70మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలిసింది. బంట్వారానికి చెందిన నెల్లి అనిత(13) ధారూరు మండలం డీకే తండాకు చెందిన కెతావత్ పద్మానాయక్(60), పుల్యానాయక్(56), పెద్దేముల్ మండలం కందనెల్లి తండాకు చెందిన నరేందర్(25) తీవ్రంగా గాయపడ్డారు. దాదాపు 30 మందికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. క్షతగాత్రులను 108 వాహనంలో వికారాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేయించారు. ఘటనా స్థలాన్ని ఆర్టీసీ అధికారులు, పోలీసులు సందర్శించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గత ఏడాది ఇదే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురై మహిళ మృతి చెందింది.



గాయపడిన బాలిక



అనంతగిరి ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సు



తాండూరు మున్సిపల్ కార్యాలయం

స్వ'చెత్త' రికార్డు

- స్వచ్ఛ సర్వేక్షణ్ -2023 సర్వేలో ర్యాంకు సాధించని తాండూరు మున్సిపాలిటీ
- పారిశుద్ధ్యం నిర్వహణలో ఏమాత్రం సంతృప్తి చెందని కేంద్ర ప్రభుత్వం
- అధికారుల నిర్లక్ష్యంతో అభాసుపాలు
- జోనల్ స్థాయిలో 48, రాష్ట్ర స్థాయిలో 80వ స్థానంతో సరి
- గత ఏడాదితో పోలిస్తే పడిపోయిన ర్యాంకులు



ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

తాండూరు: స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023 సర్వేలో తాండూరు మున్సిపాలిటీ అట్టడుగున నిలిచింది. సౌత్ ఇండియా స్థాయిలో 1,120 స్థానంతో సరి పెట్టుకోవాల్సి వచ్చింది. స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో మంచి ర్యాంక్ సాధిస్తే మున్సిపాలిటీకి నిధుల వరద పారే అవకాశం ఉంటుంది. కానీ గతేడాది అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో తాండూరు మున్సిపాలిటీకి జోనల్ స్థాయిలో 48, రాష్ట్ర స్థాయిలో 80వ ర్యాంక్ వచ్చింది. 1953లో తాండూరు మున్సిపాలిటీ ఏర్పడింది. నాటి నుంచి గ్రేడ్‌ను పెంచుకుంటూ వెళుతోంది. అయితే ఐదేళ్లుగా గాడి తప్పుతోంది. తాండూరు మున్సిపల్ పరిధిలో మొత్తం 36 వార్డులు 14 వేల ఇళ్లు, 80వేలకు పైగా జనాభా ఉంది. కేంద్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మున్సిపాలిటీల్లో స్వచ్ఛత ప్రమాణాలను మెరుగు పరచాలనే ఉద్దేశంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జాతిపిత గాంధీ జయంతి రోజున ప్రారంభించి జనవరి నెల వరకు స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే నిర్వహిస్తారు. తాండూరు మున్సిపల్ అధికారులు మూడేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పాల్గొనడం లేదు. గతంలో మున్సిపల్ కమిషనర్ పోస్టు ఖాళీగా ఉండటంతో తాండూరు ఆర్డీఓకు రెండేళ్లుగా బాధ్యతలు అప్పగించారు. దీంతో స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమం నిర్వహించడంలో సదరు ఇన్‌చార్జ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలు ఉన్నాయి. మూడు నెలల క్రితం తాండూరు మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్ అందుబాటులోకి వచ్చారు. ఆయన కూడా మున్సిపల్ నిర్వహణ సరిగ్గా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో గతేడాది అక్టోబర్ 2వ తేదీ నుంచి చేపట్టాల్సిన స్వచ్ఛత పనులపై అధికారులు దృష్టి సారించలేదు. మరో వైపు పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల వద్ద చెత్త సేకరణ, వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం, సులభ్ కాంప్లెక్స్‌ల నిర్వహణ, మురుగు నీటి కాల్వలను శుభ్రంగా ఉంచడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని 143 మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే ఫలితాలను విడుదల చేసింది. తాండూరు మున్సిపాలిటీకి 80 ర్యాంకు వచ్చింది. గతేడాది రాష్ట్ర స్థాయిలో 27వ ర్యాంకులో ఉన్న మున్సిపాలిటీ తాజాగా ప్రకటించిన ఫలితాల్లో 80వ ర్యాంకుకు పడిపోయింది. జోనల్ స్థాయిలో కూడా 44వ ర్యాంకు నుంచి 48వ ర్యాంకుతో చెత్త రికార్డును మూటగట్టుకుంది.

నిధులున్నా జరగని పనులు

గత ప్రభుత్వం తాండూరు మున్సిపల్ అభివృద్ధికి రూ.36 కోట్ల మంజూరు చేసింది. ప్రతి వార్డులో కోటి రూపాయలతో అభివృద్ధి పనులు చేయాల్సి ఉంది. అయితే పలు వార్డుల్లో నామమాత్రపు పనులు చేశారు. గత ప్రభుత్వ హయాంలో అధికార పార్టీ నేతల మధ్య వర్గపోరు కూడా తాండూరు అభివృద్ధికి ఆటంకంగా మారింది.

గాడి తప్పిన పాలన

తాండూరు మున్సిపల్ పాలన గాడి తప్పింది. అధికారులకు, పాలకవర్గానికి సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి పనులు ఏళ్లుగా నిలిచిపోయాయి. మున్సిపాలిటీలో భారీగా నిధులు ఉన్నప్పటికీ వినియోగించడంలో విఫలమవుతున్నారు. వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉంది. మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ఐదేళ్ల కాలంలో పదుల సంఖ్యలో కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. కానీ వాటిని వినియోగించకుండానే మూలకు చేర్చారంటే అధికారుల పనితీరును ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఎలక్ట్రిక్ వాహనాలు అందుబాటులోకి వచ్చాయి. వాటిని కనిపించకుండా చేయడంలో అధికారుల ప్రమేయం ఉందని పలువురు కౌన్సిలర్లు ఆరోపిస్తున్నారు.

వాహన దొంగలు దొరికారు!

సాక్షి, సిటీబ్యూరో: రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో వాహనాల చోరీకి పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు పోలీసులు. రెండు వేర్వేరు కేసుల్లో ట్రాక్టర్ ట్రాలీలు, బైక్‌లను చోరీ చేస్తున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి 13 ట్రాలీలు, 23 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు శనివారం వివరాలు వెల్లడించారు.

- నల్లగొండ జిల్లా, మారేపల్లి గ్రామానికి చెందిన సంపంగి మహే శ్, ఉర్సు వెంకన్న బంధువులు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న విలాసవంతమైన జీవితానికి అలవాటు పడ్డారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో దొంగతనాలు చేసి డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ట్రాక్టర్ ట్రాలీల చోరీలను చోరీ చేస్తున్నారు. నిర్మానుష్య ప్రాంతాల్లో ట్రాక్టర్ ట్రాలీలను టార్గెట్ చేసుకుని రాత్రి వేళల్లో ట్రాక్టర్‌ను తీసుకెళ్లి ట్రాలీకి హుక్కును తగిలించి అక్కడి నుంచి తరలించేవారు. అనంతరం వాటిని రీసేల్ విక్రేతలకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు.
- గత డిసెంబర్ 30న మాడ్గుల్ గ్రామానికి చెందిన రైతు కొప్పుల చెన్నయ్య తన పొలంలో పని పూర్తయ్యాక ట్రాక్టర్ ట్రాలీని బావి దగ్గర పార్కింగ్ చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం పొలానికి వచ్చి చూసే సరికి ట్రాలీ కనిపించలేదు. దీంతో ఈనెల 6న మాడ్గుల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేపట్టిన పోలీసులు శనివారం మధ్యాహ్నం కొల్కులపల్లి గ్రామంలో ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారించగా ట్రాక్టర్ ట్రాలీ దొంగతనాల విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో నిందితులు మహేశ్, వెంకన్నలను అరెస్టు చేశారు. ఇప్పటికే వీరిపై రాచకొండ కమిషనరేట్ పరిధిలో తొమ్మిది, నల్లగొండ జిల్లాలో రెండు, నాగర్ కర్నూల్ జిల్లాలో ఒక కేసు ఉన్నట్లు తెలిపారు. వారి నుంచి 12 ట్రాక్టర్ ట్రాలీలను స్వాధీనం చేసుకున్నారు.
- ఈ క్రమంలో శనివారం నాగోల్ రోడ్‌లోని ఎస్‌వీఎం గ్రాండ్ హోటల్ వద్ద ఉప్పల్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా.. బైక్‌పై అటుగా వచ్చిన చైతన్య సాయి కుమార్‌ను అదుపులోకి తీసుకుని ఉప్పల్ ఠాణాకు తీసుకెళ్లి విచారించగా నేరం అంగీకరించాడు. ఇప్పటికే అతడిపై రాచకొండతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో 23 కేసులు ఉన్నట్లు గుర్తించారు. నిందితుడి నుంచి 23 బైక్‌లతో పాటు ప్రింటర్, ల్యాప్‌టాప్, నకిలీ రిజిస్ట్రేషన్ కార్డులు, ఇతరత్రా వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

కైట్.. షార్ట్ సర్క్యూట్

విద్యుత్ వైర్లకు చిక్కుకుంటున్న పతంగ్‌లు

- తరచూ ట్రిప్పవుతున్న ఫీడర్లు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ప్రమాదాల బారిన చిన్నారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పండుగ వేళ సరదాగా పిల్లలు, పెద్దలు ఎగరేస్తున్న గాలిపటాలు 'షాక్' ఇస్తున్నాయి. విద్యుత్ వైర్లకు చుట్టుకుని సరఫరాకు అంతరాయం కలిగిస్తున్నాయి. వాటిని కిందికి బలంగా లాగడంతో ఒకదానికొక వైరు తగిలి షార్ట్ సర్క్యూట్‌తో ఫీడర్లు ట్రిప్పవుతున్నాయి. వాటి పరిధిలో ఉన్న గృహ, వాణిజ్య సంస్థలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. సంక్రాంతి నేపథ్యంలో చిన్న పెద్దలంతా కలిసి ఇళ్లపై నిలబడి పతంగ్‌లు ఎగరవేయడం తెలిసిందే. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, వీధుల్లో ఉన్న లైన్ల మధ్య ఈ పతంగ్‌లు చిక్కుతూ సరఫరాలో అంతరాయానికి కారణమవుతున్నాయి. రెండు రోజులుగా జిల్లాలో వెలుగు చూస్తున్న విద్యుత్ అంతరాయాలకు ఈ పతంగ్‌లే కారణమని ఇంజనీర్లు అభిప్రాయపడుతున్నారు. వీటి కారణంగా శనివారం సరూర్‌నగర్, రాజేంద్రనగర్, సైబర్ సిటీ సర్కిళ్ల పరిధిలో కరెంట్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సబ్‌స్టేషన్‌లోని ఒక ఫీడర్ ఆన్ చేసిన వెంటనే మరో ఫీడర్ పడిపోతూ సెంట్రల్ బ్రేక్ డౌన్ బృందాలకు తలనొప్పిగా మారాయి.

పొంచి ఉన్న ప్రమాదాలు

ఇంటిపైనే కాకుండా బాల్కనీ, ప్రహరీలపై నిలబడి పతంగ్‌లు ఎగరవేస్తూ ప్రమాదవశాత్తు పలువురు చిన్నారులు కాలుజారి కిందపడుతున్నారు. వీరిలో కొంత మంది తీవ్ర గాయాలపాలై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతుంటే.. మరికొందరు ఏకంగా మృత్యువాత పడుతున్నారు. ఇంటి ముందు నుంచి వెళ్తున్న లైన్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లనే కాదు.. డిస్ట్రిబ్యూషన్ సబ్‌స్టేషన్ వైర్ల మధ్య చిక్కుకున్న పతంగ్‌లను తీసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురవుతున్నారు. తాజాగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని నాగోల్‌లో ఇంటిపై నిలబడి గాలిపటం ఎగరేస్తూ ప్రమాదవశాత్తు శివకుమార్ (13) మృతి చెందాడు.

చైనా మాంజా ఉచ్చుకు..

పతంగ్‌లను ఎగరేసేందుకు కొంతమంది ప్రమాదకరమైన చైనా మాంజాను వాడుతున్నారు. ఆకాశంలో ఎగిరే పక్షులు,రోడ్డుపై వాహనాలపై వెళ్లే ప్రయాణికులు ఈ చైనా మాంజా ఉచ్చుకు చిక్కుకుని ప్రమాదాల బారినపడుతున్నారు. నిజానికి చైనా మాంజా వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినప్పటికీ.. మార్కెట్లలో విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. టాస్క్‌ఫోర్సు పోలీసులు వీటిని గుర్తించి, విక్రయదారులను అదుపులోకి తీసుకుంటున్నా అమ్మకాలు మాత్రం ఆగడం లేదు.

జాగ్రత్తలు మేలు

- విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా, బహిరంగ ప్రదేశాల్లో, మైదానాల్లో మాత్రమే పతంగులు ఎగురవేయండి.
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్ల వద్ద ఎగురవేయడం ప్రమాదకరం.
- ఒక వేళ పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లు, ఇతర విద్యుత్ పరికరాలపై పడితే విద్యుత్ సరఫరాలో అంతరాయంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- కాటన్, నైలాన్, లినెన్‌తో చేసిన మాంజాలను మాత్రమే వాడండి. మెటాలిక్ మాంజాలు వాడొద్దు.
- మెటాలిక్ మాంజాలు విద్యుత్ వాహకాలు కనుక అవి లైన్లపై పడ్డప్పుడు విద్యుత్ షాక్ కలిగే అవకాశం ఉంది.



- పొడి వాతావరణంలో మాత్రమే పతంగులు ఎగురవేయాలి. తడి వాతావరణంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువ.
- పతంగులు కానీ, మాంజాలు కానీ విద్యుత్ లైన్లపై, ఇతర విద్యుత్ పరికరాలపై పడ్డప్పుడు వాటిని వదిలేయండి.
- బాల్కనీ/ గోడల మీద నుంచి పతంగులు ఎగురవేయొద్దు. ఇది ప్రమాదకరం.
- పతంగులు ఎగురవేసేటప్పుడు తమ పిల్లలను గమనించాలి. పిల్లలు తెగిన, కింద పడ్డ విద్యుత్ వైర్లను తాకనివ్వొద్దు.
- ఒకవేళ విద్యుత్ వైర్లు, విద్యుత్ పరికరాలపై పతంగులు/మాంజాలు తెగిపడ్డట్లు ఉన్నా, విద్యుత్ వైర్లు తెగి రోడ్డుపై పడి ఉన్నా, వాటిని తాకకూడదు. వెంటనే విద్యుత్ శాఖ వారి 1912కి గాని లేదా సమీప విద్యుత్ కార్యాలయానికి గానీ లేదా సంస్థ మొబైల్ యాప్ ద్వారా గానీ లేదా సంస్థ వెబ్‌సైట్ ద్వారా www.tssouthernpower.com సంప్రదించాలి.

– ఆనంద్, సీజీఎం, ఆర్ఆర్ జోన్

క్లుప్తంగా

ఎదురెదురుగా బైకులు ఢీ: వ్యక్తి మృతి

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం చన్గోముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని సోమన్‌గుర్తికి చెందిన సాయికుమార్(29) తన ద్విచక్ర వాహనం (ఏపీ28 ఏపీ6709)పై మండల పరిధిలోని పెద్ద ఉమ్మెంతాల్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. సోమన్‌గుర్తి గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన (టీఎస్34 బి2417) నంబర్ కలిగిన మరో బైక్ ఇతన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో సాయికుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు సాయికుమార్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

బొంరాస్‌పేట: ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం మండల పరిధిలోని బాపన్‌చెర్వుతండాలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రూప్‌సింగ్ జాదవ్(28) రెండు రోజులు క్రితం కుటుంబ సభ్యులతో కలిసి కులదేవతలకు పూజలు నిర్వహించాడు. అంతా కలిసి విందులతో మొక్కులు తీర్చుకున్నారు. ఆతర్వాత ఏమైందో కానీ భార్య ఇంట్లో లేని సమయంలో శుక్రవారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంక్రాంతి పండుగ పూట రూప్‌సింగ్ మృతితో తండాలో విషాదం నెలకొంది.

డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి తదితరులు

అనంతగిరి: టీఎస్ ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం వికారాబాద్ జిల్లా ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర డైరీని శనివారం ఈ సంఘం గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో నూతన భవన నిర్మాణం తోపాటు అన్ని సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

సర్వశిక్షా ఉద్యోగుల జీతాల కష్టాలు తీర్చాలి

బొంరాస్‌పేట: సమగ్ర శిక్షా ప్రాజెక్టులో పని చేస్తున్న ఉద్యోగుల వేతన కష్టాలను తీర్చాలని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఎండీ షఫీ కోరారు. శనివారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న 22,500 మంది ఉద్యోగులకు నవంబరు, డిసెంబరు రెండు నెలల వేతనాలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో, మానసిక ఒత్తిళ్లకు గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండగ పూట బాధాకరమన్నారు. కుటుంబ, ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలన్నారు.

తల్లి మందలించిందని..

- ఇంటి నుంచి వెళ్లిపోయిన బాలుడు
- అదృశ్యం కేసు నమోదు

పహాడీషరీఫ్: తల్లి మందలించడంతో ఓ బాలుడు ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సీహెచ్.వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌నగర్‌కు చెందిన గుట్టకాడి జంగమ్మ కుమారుడు జి.రాకేశ్(17) ఏపని చేయడం లేదు. ఈ విషయమై తల్లి మందలించింది. దీంతో ఏపీలో మెకానిక్ పని నేర్చుకుంటానంటూ ఈనెల 12న మధ్యాహ్నం 2 గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించినా ఫలితం కనిపించలేదు. శనివారం జంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా, 87126 62367 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఓపెన్ చేస్తే అంతే..

సైబర్ క్రైం అంటే సహజంగానే చాలా మందికి గుబులు పుడుతుంది. అందులో పల్లె ప్రజల సంగతి చెప్పలేనిది. తమ ఫోన్‌కు మెసేజ్ రూపంలో వచ్చిన లింకును తెరవడం.. బ్యాంకు ఖాతాలోని డబ్బులు మాయమవటం అనేది నేడు ఎక్కడో ఓ చోట నిత్యం జరుగుతూనే ఉంది. దీంతో ఆన్‌లైన్ లావాదేవీలంటే ప్రజలు జంకుతున్నారు. తెలిసిన వారు ఫోన్ చేసి, ఓటీపీ చెప్పమన్నా వెనుకంజ వేస్తున్న వైనంపై 'సాక్షి' కథనం..

ఓటీపీల విషయంలో అప్రమత్తతే రక్ష

- అక్కరలేని లింకులను తెరవద్దు
- సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దు
- డిజిటల్ లావాదేవీలపై జాగ్రత్త



కుల్కచర్ల: మారుతున్న కాలంతో పాటు, అందివచ్చిన సాంకేతికతను అందిపుచ్చుకోవటానికి ప్రతి ఒక్కరూ ఉత్సాహం చూపుతున్నారు. అందులో ఆన్‌లైన్ లావాదేవీలను ఒకటిగా భావించవచ్చు. ప్రభుత్వాలు సైతం డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తుండటంతో.. ప్రజలు నగదు రహిత ప్రక్రియకు మొగ్గుచూపుతున్నారు. క్రయవిక్రయాల్లో ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి వాటిని ఉపయోగిస్తూ కూర్చున్న చోటే ఆర్థిక లావాదేవీలను కొనసాగిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఎంత టెక్నాలజీ పెరిగినా.. దానికి మించిన ఆలోచనలతో సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టేందుకు పుట్టుకొస్తున్నారు. ఆన్‌లైన్ లావాదేవీలను పసిగడుతూ.. జనం బ్యాంకు ఖాతాల్లోని డబ్బును కొల్లగొడుతున్నారు. సగటు మనిషి జీవిత కాలం చెమటోడ్చి సంపాదించినదంతా క్షణాల్లో లూటీకి పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

ఓపెన్ చేసినా.. ఓటీపీ చెప్పినా..

ఉద్యోగ అవకాశాలు అంటూ, యాప్ డౌన్‌లోడ్ చేసుకుని మరొకరితో చేయిస్తే డబ్బులు వస్తాయంటూ అపరిత వ్యక్తుల నుంచి ఫోన్‌లకు లింకులు వస్తున్నాయి. దీనిని ఓపెన్ చేసిన వెంటనే.. అవతలి వ్యక్తులు పసిగట్టి, సదరు వ్యక్తి బ్యాంకు ఖాతాలో ఉన్న నగదును స్వాహా చేస్తున్నారు. వీడియో గేమ్‌లు ఆడుతున్న క్రమంలో వచ్చిన లింకులపై క్లిక్ చేయడం వలన డబ్బులు కోల్పోయే ప్రమాదం లేకపోలేదు. ఇలాంటి ఘటనలు చిన్న పిల్లలు గేమ్‌లు ఆడుతున్న సందర్భాల్లో ఎక్కువగా జరుగుతుంటాయి. అంతే కాకుండా.. మీరు సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకున్నట్లైతే ఓటీపీ చెప్పండి అంటూ, ఇతరత్రా అంశాల పేరుతో ఓటీపీలు చెప్పించుకుని అమాయకులను బురిడీ కొట్టిస్తున్న వైనం ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఏం చేస్తే.. ఏం అవుతుందోనన్న భయాందోళన చెందుతున్నారు

ఫోన్ కొట్టేసి, డబ్బులు కాజేసి..

మండల కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్ రెడ్డి మూడు రోజుల క్రితం హైదరాబాద్ వెళ్లివస్తున్న క్రమంలో బస్సు ఎక్కుతుండగా.. జేబులో ఉన్న ఫోన్ ఎవరో దొంగిలించారు. అనంతరం చోరీకి పాల్పడిన వ్యక్తి బ్యాంకు ఖాతాలకు లింక్ ఉన్న ఆధార్ కార్డు ద్వారా ఖాతాలోని రూ.2లక్షల 21వేలను కాజేశాడు. స్థానిక పోలీసులతో పాటుగా సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించినా.. పోగొట్టుకున్న ఫోన్, డబ్బులు తిరిగి వచ్చే పరిస్థితి కనిపించడం లేదని సదరు వ్యక్తి వాపోయాడు.

క్లిక్ చేసిన వెంటనే..

వాట్సప్‌లో ఒక సంస్థ పేరుతో ఏపీకే యాప్ లింక్ వచ్చిన వెంటనే ఆ మెసేజ్‌ను క్లిక్ చేయడం వలన రూ.30వేలు మాయమయ్యాయని గుర్తించిన లింగంపల్లి గ్రామానికి చెందిన సంతోష్.. వెంటనే మీడియా దృష్టికి తీసుకువెళ్లగా.. సైబర్ క్రైం నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో అప్రమత్తమైన సైబర్ పోలీసులు డ్రా కాబడిన నగదులో రూ.15వేలను హోల్డ్‌లో పెట్టారు. ఆ మెసేజ్‌ను పార్వర్డ్ చేసిన వ్యక్తిని పోలీసుల దగ్గరికి తీసుకువచ్చి, ఇతని వల్ల నా డబ్బులు పోయాయని ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఫోన్ కొట్టేసిన వారే..



నాలుగు రోజుల ముందు హైదరాబాద్ వెళ్లి వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి నా ఫోన్ దొంగిలించాడు. అనంతరం ఒక్క రోజులోనే నా ఖాతాలోంచి రూ.2లక్షల 21వేల డ్రా చేయబడ్డాయి. సైబర్, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాను. అయినప్పటికీ డబ్బులు తిరిగివచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– విష్ణువర్ధన్ రెడ్డి, కుల్కచర్ల

గుడ్డిగా నమ్మరాదు



సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. కొత్త వ్యక్తులు ఎవరు ఫోన్ చేసినా ఓటీపీలు చెప్పకూడదు. అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయవద్దు. ఇంట్లో ఉండి జాబ్ చేసుకోవచ్చునని, అందుకు కొంత నగదు కట్టాలి అంటూ వచ్చే సందేశాలను గుడ్డిగా నమ్మరాదు. ఏదైనా ప్రక్రియ ద్వారా సైబర్ మోసానికి గురైతే సైబర్ క్రైం నంబరు 1930ను సంప్రదించాలి.

– ఎస్ఐ శ్రీశైలం, కుల్కచర్ల

ఆకట్టుకున్న రంగవల్లులు



బహుమతి ఇస్తున్న మున్సిపల్ ఛైర్మన్

శ్రీవారి ఆలయంలో ముగ్గుల పోటీలు

కొడంగల్: స్థానిక బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో శనివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 23 మంది మహిళలు పాల్గొని సప్త వర్ణాలతో రకరకాల ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా పరిసరాలు సింగిడిని తలపించాయి. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని పీఏసీఎస్ ఛైర్మన్ శివకుమార్ గుప్తా, మమత దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన కాంపిటిషన్‌లో.. విశ్రాంత డ్రాయింగ్ మాస్టార్ బసలింగయ్య, ఉపాధ్యాయుడు చంద్రప్ప, ఆర్టిస్ట్ వెంకట్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి బోయిని సరిత, స్వప్న, రెండో బహుమతి పార్వతి, స్వామ్య, మూడో బహుమతి అశ్విని, కోమల్ అందుకున్నారు. విజేతలకు ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ ఛైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఛైర్‌పర్సన్ ఉషారాణి బహుమతులు ప్రదానం చేశారు. విజేతలతో పాటు ముగ్గు వేసిన ప్రతి ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పండితుడు ధరూర్ శ్రీనివాసాచార్యులు, ఆలయ ధర్మకర్త నందారం శ్రీనివాస్, నందారం ప్రశాంత్, బాలప్రకాశ్, మురహరి వశిష్ట తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి దక్కించుకున్న ముగ్గు

గిరిజనులకు తాగునీటి కష్టాలు

వాటర్ మెన్‌కు వేతన వెతలు..



బోరు బావుల నుంచి తాగునీటిని తెచ్చుకుంటున్న తండా వాసులు

బంట్వారం: నాలుగు నెలలుగా గౌరవ వేతనం అందక పోవడంతో మిషన్ భగీరథ నీటిని విడుదల చేసే వాటర్ మెన్ విసుగు చెంది, విధులకు దూరంగా ఉన్నాడు. ఫలితంగా తాగునీటి సరఫరాకు నాలుగు రోజుల పాటు అంతరాయం కలిగింది. దీంతో తండావాసులను నీరు కరవై అల్లాడిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి నాగవరం తండాకు.. బంట్వారం బ్రేక్ ప్రెషర్ ట్యాంక్ (బీపీటీ) నుంచి తాగునీరు సరఫరా అవుతుంది. కానీ స్థానికంగా నీటిని విడుదల చేసే వాటర్ మెన్‌కు వేతనం అందడం లేదు. దీంతో సందరు వ్యక్తి ట్యాంక్ నుంచి నీటిని విడుదల చేయడం లేదు. ఈ క్రమంలో తండా వాసులకు తాగునీటి కష్టాలు ఎదురయ్యాయి. ఇదే విషయమై సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వేణుమాధవ్‌ను సంప్రదించగా సమస్యను పరిష్కరించామని పేర్కొన్నారు. వాటర్ మెన్‌కు వేతనం అందని మాట వాస్తవమేనని, పంచాయతీకి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులు పెండింగ్‌లో ఉండటం వలన వేతనం అందలేదని వివరించారు. మండల స్థాయిలో నిలిచిపోయిన జీపీ నిధుల విడుదలపై సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు ఏఈ చెప్పారు. వాటర్ మెన్‌కు నచ్చజెప్పి శనివారం సాయంత్రం భగీరథ నీటిని విడుదల చేయించినట్లు వెల్లడించారు.

తాళం చెవితో వీడిన పుర్రె మిస్టరీ

కనిపించకుండా పోయిన వృద్ధురాలు అనంతమ్మేనని గుర్తింపు





ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీధర్, ఎస్ఐ శ్రీశైలం (ఇన్‌సెట్లో) వృద్ధురాలి పుర్రె

కుల్కచర్ల: మద్యానికి బానిసై, మానసిక స్థితి సరిగా లేని ఓ వృద్ధురాలు ఇంటినుంచి వెళ్లి, అస్థిపంజరంగా (పుర్రె) దొరికింది. ఈ సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అనంతమ్మ(60) మానసిక పరిస్థితి సరిగ్గా లేక తిరుగుతూ ఉండేది. ఎప్పుడో కాని ఇంటికి వెళ్లేది కాదు. ఈ క్రమంలో నాలుగు నెలల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబీకులు తెలిసిన వారి ఇళ్లలో, చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించలేదు. ఆ తరువాత ఆమె గురించి మరచిపోయారు. తాజాగా శనివారం రాంరెడ్డిపల్లి గ్రామశివారులో మనిషి పుర్రె, మహిళ వెంట్రుకలు కనిపించాయని కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా.. పుర్రె, పక్కనే ఉన్న వెంట్రుకలు, వాటికి ఉన్న దారానికి (దండ లాంటిది) ఒక తాళం చెవి ఉండటాన్ని గుర్తించారు. అనంతరం కొంత కాలంగా పరిసర ప్రాంతాల్లో కనిపించకుండా పోయిన వారి వివరాలు కోసం ఆరా తీశారు. ఈ క్రమంలో దొంగఎన్కెపల్లి గ్రామానికి చెందిన అనంతమ్మ ఇంటికి వెళ్లి.. ఇంటికి ఉన్న తాళాన్ని.. ఘటనా స్థలంలో లభించిన కీతో తీయగా.. తాళం తెరుచుకుంది. దీంతో పుర్రె అనంతమ్మదే అని నిర్ధారణకు వచ్చారు. తహసీల్దార్ మురళీధర్‌తో ప్రాథమికంగా పంచనామ నిర్వహించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రానున్న ఎన్నికల్లో సత్తాచాటుదాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మాజీ ఎమ్మెల్యే ఆనంద్

ధారూరు: రానున్న లోకసభ, మున్సిపల్, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి, సత్తా చాటుదామని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పిలుపునిచ్చారు. శనివారం ధారూరు మండలం రుద్రారం, గట్టిపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఓటమి చెందామన్న భావన మీలో ఉండరాదని, ఓటమి గెలుపునకు నాంది అనేది గుర్తించుకోవాలని సూచించారు. సమష్టిగా పనిచేసి, పార్టీని బలోపేతం చేద్దామన్నారు. ముందుగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకుందామని ఆశాభావం వ్యక్తంచేశారు. కలిసి పనిచేస్తే సాధించలేనిదంటూ ఏమీ లేదని, గెలుపే లక్ష్యంగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రుద్రారం వెంకటయ్య, కిష్టఫర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని జీపీ కార్మికురాలి మృతి

యాచారం: బైక్ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలైన పంచాయతీ కార్మికురాలు అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి.. గునుగల్ అనుబంధ గ్రామం ఇంద్రనగర్‌కు చెందిన భారతమ్మ(55) గడ్డమల్లయ్యగూడలో పంచాయతీ కార్మికురాలిగా విధులు నిర్వర్తిస్తోంది. పనులు ముగించుకుని శనివారం సాయంత్రం కిలోమీటర్ దూరంలో ఉన్న ఇంద్రనగర్‌కు నడుచుకుంటూ బయలుదేరింది. గునుగల్ గేట్ నుంచి మంచాల మండలం రంగాపూర్ గ్రామానికి బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి గడ్డమల్లయ్యగూడలో భారతమ్మను బలంగా ఢీకొట్టాడు. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే ప్రాణాలు వదిలింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సైదయ్య తెలిపారు. భారతమ్మ మృతిపై సర్పంచ్ జంగయ్య ఆవేదన వ్యక్తంచేశారు.

అనుమానాస్పద స్థితిలో..

కేశంపేట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని పోమాల్‌పల్లి గ్రామ శివారులో శనివారం వెలుగుచూసింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... కొండారెడ్డిపల్లికి చెందిన మిద్దె యాదగిరి (38) బోర్ లారీ పైన కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇందులో భాగంగా ఈనెల 4న వనపర్తి జిల్లా కేంద్రంలోని కరుణాకర్‌రెడ్డి బోర్‌లారీ పైన పనికి వెళ్లాడు. 8న రాత్రి 7 గంటల సమయంలో బోర్ లారీ యాజమాని మృతుడి భార్య స్వాతికి ఫోన్‌చేసి యాదగిరి ఇంటికి వచ్చినట్లు చెప్పాడు. మృతుడికి ఫోన్ చేయగా ఒక్కసారి రింగ్ అయిన అనంతరం స్విచాఫ్ వచ్చింది. అప్పటి నుంచి యాదగిరి కోసం వెతుకుతుండగా శనివారం పోమాల్‌పల్లి శివారులోని చెరువు అలుగు వద్ద చనిపోయి ఉన్నట్లు గ్రామస్తులు గుర్తించారు. అయితే తన కొడుకు మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లి మిద్దె అమృత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం

పహాడీషరీఫ్: యువకుడు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాహీన్‌నగర్ హబీబ్ కాలనీకి చెందిన మహ్మద్ రషీద్ కుమారుడు మహ్మద్ ఉమర్(20) విద్యార్థి. ఈనెల 6న తన తండ్రికి సంబంధించిన ఆటో (ఏపీ 28 వై 8604) తీసుకుని, బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని వద్ద ఫోన్ లేకపోవడం, అన్ని ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం కనిపించకపోవడంతో శనివారం రషీద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో లేదా 87126 62366 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు.

నిషేధిత చైనా మాంజా స్వాధీనం

వ్యాపారి అరెస్టు



స్వాధీనం చేసుకున్న చైనా మాంజా, నిందితుడితో పోలీసులు

తాండూరు టౌన్: పట్టణంలో అక్రమంగా విక్రయిస్తున్న నిషేధిత చైనా మాంజాను పోలీసులు పట్టుకున్నారు. శివాజీచౌక్ పాండురంగ దేవాలయం సమీపంలోని శ్రీకాంత్ అనే వ్యాపారి దీన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో షాపుపై దాడి చేశారు. అతని నుంచి రూ.1.11 లక్షల విలువ చేసే చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. వ్యాపారిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్ ప్రశాంత్‌వర్ధన్ తెలిపారు.

వికారాబాద్‌లో దాడులు..

అనంతగిరి: వికారాబాద్‌లో వెలిసిన పతంగుల దుకాణాల్లో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిషేధిత చైనా మాంజా విక్రయిస్తున్న రెండు దుకాణాల్లో 6 పెద్ద చక్రీలు, 20 చిన్న చక్రీలు, 30 లూస్ ప్యాకెట్ల చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

వెంకన్నను దర్శించుకున్న పట్నం దంపతులు



శ్రీవారి సన్నిధిలో పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దంపతులు

తాండూరు: మాజీ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి, జెడ్పీ ఛైర్‌పర్సన్ పట్నం సునితారెడ్డి దంపతులు కుటుంబ సమేతంగా తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని శనివారం మహేందర్‌రెడ్డి కుటుంబంతో పాటు తాండూరు మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాటికొండ స్వప్నపరిమళ్ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలింత మృతి

- వారం రోజుల క్రితమే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి
- రాత్రి వేళ అస్వస్థతకు గురికావడంతో ఆర్‌ఎంపీ వద్ద వైద్యం
- షాద్‌నగర్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారణ
- కేసు నమోదు చేసిన పోలీసులు

కొత్తూరు: అనుమానాస్పదస్థితిలో ఓ బాలింత మృతి చెందింది. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. బిహార్‌కు చెందిన సంతోష్‌కుమార్(38), చిన్న పూజాయాదవ్(22) భార్యభర్తలు. పూజాయాదవ్ ఈనెల 5న నగరంలోని పేట్లబుర్జు ప్రభుత్వ ఆస్పత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉండడంతో వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. ఇదిలా ఉండగా ఈనెల 12న రాత్రి సమయంలో పూజాయాదవ్ అస్వస్థతకు గురైంది. దీంతో ఆమెను స్థానికంగా ఉండే ఓ ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. కొద్దిసేపు బాగానే ఉన్న బాలింత మళ్లీ ఇబ్బంది పడటంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వైద్యం వికటించడంతోనే బాలింత మృతి చెందిందా..? ఇతర కారణాలు ఏవైనా ఉన్నాయా అనే విషయాలు పోస్టుమార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాతే తెలుస్తాయని వెల్లడించారు.

కనుల పండువగా గోదా కల్యాణం

కడ్తాల్: మండల కేంద్రంలోని భూనీలాసహిత చెన్నకేశవ స్వామి ఆలయంలో గోదారంగనాథస్వామి కల్యాణోత్సవం శనివారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. శుద్ధజలం, పంచామృతాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. బాచిరెడ్డి మంజుల, నరేందర్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా, శారద, భాస్కర్‌రెడ్డి, కాసోజు రమేశ్‌చారి, మాధవి దంపతులు పుస్తెమెట్టెలు అందజేశారు. కాంటేకర్ రాఘవేందర్‌జీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అర్చకులు రఘురాం, వేణుగోపాల్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అక్రమంగా డీజిల్ తరలిస్తున్న ట్యాంకర్ సీజ్

కొందుర్గు: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న పదివేల లీటర్ల డీజిల్, ట్యాంకర్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు కొందుర్గు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఆమనగల్లుకు చెందిన ఆనంద్ కుమార్.. కొంతకాలంగా కర్ణాటక శివారు సేడమ్ ప్రాంతంలో తక్కువ ధరకు లభిస్తున్న డీజిల్‌ను కొనుగోలు చేసి తన ట్యాంకర్ ద్వారా ఇక్కడికి తరలిస్తున్నాడు. శంషాబాద్, ఆమనగల్లు ప్రాంతాల్లోని క్రషర్ మిల్లులకు విక్రయిస్తున్నాడు. ఇలా లీటర్ డీజిల్‌పై రూ.8 వరకు లాభం ఆర్జిస్తున్నాడు. ఇది తెలియడంతో మరికొంతమంది సైతం ఆనంద్ బాటలో అక్రమ వ్యాపారం మొదలు పెట్టారు. ఇదిలా ఉండగా శనివారం స్థానిక పోలీసులు కొందుర్గు చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా డీజిల్ తరలిస్తున్న వాహనం పట్టుబడింది. షాద్‌నగర్ సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్‌ప్రసాద్ సమక్షంలో పంచనామా నిర్వహించి, ట్యాంకర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.